# విజయవాడ నగర పోలీస్ కమీషనర్ కార్యాలయము

**పత్రికా ప్రకటన** **తేది.04.07.2018.**

## మహిళా సమస్యల పరిష్కార వేధిక "మహిళా రక్షణ" కేంద్రం ప్రారంభం

సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలకు క్షేత్రస్థాయిలో పరిష్కార మార్గాలు చూపి వారికి తగు రీతిలో న్యాయం చేసి, మరియు వారికి సాధికారికతను అందించేందుకు ప్రభుత్వం ఆలోచనలను ఆచరణలో పెట్టేందుకు "మహిళా మిత్ర" పేరుతో ప్రత్యేక విభాగాన్ని రాష్ట్రంలోనే ప్రపధమంగా ఏర్పాటు చేసి, తద్వారా భద్రత మరియు రక్షణ కలిగించడమే కాకుండా వివిధ సామాజిక చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తూ మహిళల్లో చైతన్య స్ఫూర్తిని నింపి, స్నేహపూర్వకమైన వాతావరణం కల్పిస్తూ వారి అభివృద్ధి కోసం విజయవాడ నగర పోలీస్ శాఖ కృషి చేస్తున్న విషయం విధితమే.

ఈ నేపథ్యంలో మహిళలకు సంబంధించి ఒక ప్రత్యేక వేధికను ఏర్పాటు చేయాలని సంకల్పించిన నగర పోలీస్ కమీషనర్ గారు మహిళా మిత్రలో భాగంగా విజయవాడ నగరంలో మహిళా రక్షణ పేరుతో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేసి, ది. 4.7.18న మహిళా పోలీస్‌స్టేషన్ సమీపంలో ఈ కేంద్రాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ కేంద్రం నందు మహిళలకు సంపూర్ణ సహాయ సహకారాలు అందించబడతాయి. ఏదైనా సమస్యపై పోలీస్ స్టేషన్‌కు వెళ్ళడానికి సంకోచిస్తే నేరుగా ఈ కేంద్రానికి వచ్చి తమ సమస్యలను విన్నవించుకొని సరైన పరిష్కారము పొందవచ్చు. ఈ మహిళా రక్షణ కేంద్రంలో ముఖ్యంగా బాలికలు మరియు మహిళల కోసం ప్రభుత్వం అందిస్తున్న వివిధ కార్యక్రమాలను పొందుపర్చి, ఆయా కార్యక్రమాలపై అవగాహన కల్పించడం జరుగుతుంది.

ఈ సందర్భంగా నగర పోలీస్ కమీషనర్ గారు మాట్లాడుతూ... విజయవాడ నగరంలో మహిళా మిత్ర ద్వారా గడచిన 2 సంవత్సరాలుగా అనేక సామాజిక కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా గతంతో పోల్చుకుంటే చాలావరకు పరిస్థితుల్లో మార్పును తీసుకువచ్చి పురోగతి సాధించడం జరిగిందన్నారు. కాని ప్రజా సహకారం మరియు భాగస్వామ్యంతో ఇంకా మెరుగైన పురోగతి సాధించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. మహిళా మిత్రలో భాగంగా ఏర్పాటు చేసిన మహిళా రక్షణ కేంద్రాన్ని వివిధ సమస్యలు ఉన్న మహిళలు నిర్భయంగా సందర్శించి ఆయా సమస్యలను పరిష్కరించుకోవడంతో పాటు చర్చించుకునే ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎక్కువ మంది మహిళలు సమస్యలు చెప్పుకోవడానికి పోలీస్‌స్టేషన్‌లను ఆశ్రయించాలంటే సంశయిస్తుంటారని, పోలీస్‌స్టేషన్ కాకుండా అదే సమస్యను చెప్పుకోవడానికి మరియు పరిష్కరించుకునేందుకు ఎక్కడికి వెళ్ళాలో సమాచారం చెప్పడానికి మహిళా రక్షణ కేంద్రం వేదికగా ఉంటుందని, మహిళలకు సంబంధించి ఏ విధమైన సమాచారమైనా ఇందులో తెలుసుకోవచ్చన్నారు.

అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం బాలికలు మరియు మహిళల భద్రత, రక్షణ, అభివృద్ధి, సమస్యల పరిష్కారం మరియు మహిళా సాధికారతకు ప్రాధాన్యం ఇచ్చి వివిధ కార్యక్రమాలను రూపొందించి వాటిని అమలు చేయడం జరుగుతోంది. కాని ప్రభుత్వం వివిధ వినూత్న కార్యక్రమాలను వివిధ కార్యరక్రమాల సమాచారం, సేవలు మహిళలకు తెలియడం లేదని, మహిళా రక్షణ కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు కార్యక్రమాల గురించిన పూర్తి సమాచారం అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు.

అదే విధంగా మహిళా రక్షణ కేంద్రంలో మహిళా సమస్యలకు సంబంధించి 1091 హెల్ప్‌లైన్ నంబరును ఏర్పాటు చేయడంతో పాటు 24 గంటలు పని చేసే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందని, అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా హెల్ప్‌లైన్ 181ను ఈ కేంద్రంలో లింక్ చేయడం జరుగుతుందన్నారు. మహిళా సమస్యల కోసం డయల్ 100ను ఈ కేంద్రానికి అనుసందానం చేయడం జరుగుతుందన్నారు. అలాగే ఇందులో కొన్ని మహిళా రక్షక్ బృందాలను సిద్దంగా ఉంచి ఇక్కడి నుండి సమస్యాత్మక ప్రాంతాలకు పంపించేందుకు చర్యలు తీసుకోవడం జరిగింది. ఇప్పటి వరకు మహిళా రక్షక్ బృందాల ద్వారా విజయవాడ నగర పోలీస్ కమీషనరేట్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో మొత్తం 3274 మంది ఈవ్‌టీజర్సును అదుపులోకి తీసుకుని వారికి వాసవ్య మహిళా మండలి చెన్నుపాటి విద్య గారి ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించి యువతకు అవగాహన కలిగించడం జరిగిందన్నారు. ఇందుకు మహిళా మిత్ర సభ్యులు ముఖ్యంగా శ్రీమతి చెన్నుపాటి విద్య మరియు శ్రీమతి డా॥కీర్తి గారికి పోలీస్ శాఖ తరపున ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు.

ప్రత్యేకించి ఈ మహిళా రక్షణ కేంద్రంలో కౌన్సిలింగ్ సెంటర్ ఏర్పాటు చేసి, నిష్ణాతులైన మానసికతత్వ నిపుణులు, మహిళా పోలీస్‌స్టేషన్ సిబ్బంది, వివిధ ఎన్.జి.ఓ. ఆర్గనైజేషన్‌లతో మహిళా సమస్యల పరిష్కారానికై కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతుంది. అదే విధంగా మహిళా సమస్యలపై చర్చా కార్యాక్రమాలు నిర్వహించడబడతాయి. కావున ఎన్.జి.ఓ. ఆర్గనైజేషన్‌లు మహిళా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్న వివిధ వర్గాల వారు, స్వచ్ఛంద సంస్థల వారు ఈ వేధికను వినియోగించుకుని కౌన్సిలింగ్ మరియు చర్చా వేధికలను వినియోగించుకుని సలహాలు మరియు సూచనలు అందిచవచ్చని ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ గారు కోరారు.

మహిళా రక్షణ కేంద్రం అంటే పోలీసులకు సంబంధించినదిగా భావించకుండా మహిళలకు సంబంధించిన ఒక మాతృ వ్యవస్థగా పరిగణించి మనదనుకోవాలన్నారు. కావున పోలీసు శాఖ చేపడుతున్న ఇటువంటి కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములై సహకరించగలరని ఈ సందర్భంగా నగర పోలీస్ కమీషనర్ గారు విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా విజయవాడ సైకాలజిస్ట్స్ అసోసియేషన్, కౌన్సిలింగ్ సైకాలజిస్ట్స్ అసోషియేషన్ మరియు ఇన్నర్ వీల్ క్లబ్‌కు చెందిన మహిళలు స్వచ్ఛందంగా మహిళా రక్షణ కేంద్రం నందు కౌన్సిలింగ్ నిర్వహించుటకు ముందుకొచ్చారు.

ఈ సందర్భంగా మహిళా రక్షణకు సంబందిచిన ఒక ఫేస్‌బుక్ https://facebook.com/MahilaRakshanaKendram కూడా ఈ నోటతో పాటు పంపడం జరుగుతుంది. ఈ లింక్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చును. సదరు లింక్ ద్వారా ఇచ్చినటువంటి ఫిర్యాదులను కూడా సేకరించి పరిష్కరించడం జరుగుతుంది.

కార్యక్రమంలో విజయవాడ జాయింట్ పోలీస్ కమీషనర్ శ్రీ టి.కాంతి రాణ ఐపిఎస్, వాసవ్య మహిళా మండలి డా॥ శ్రీమతి బి.కీర్తి, లా & ఆర్డర్-1 డిసిపి శ్రీ డా॥గజరావు భూపాల్ ఐపిఎస్, అడ్మిన్ డిసిపి శ్రీ జె.బ్రహ్మారెడ్డి, క్రైమ్ డి.సి.పి శ్రీమతి షిరీన్ బేగం గారు, మరియు విజయవాడ నగరంలో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు సిబ్బంది మహిళా మిత్ర సభ్యులు, సిద్ధార్థ కళాశాల మహిళా మిత్ర సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

-- xx --